

యూనివర్శిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ అంటే సినిమాల్లోలా ఎంతో అందమైన వాతావరణం ఉంటుందని విద్యార్థులు ఊహించుకుంటారు. కాలేజీ ఆవరణంతా తారురోడ్లు, వాటి పక్కన పచ్చని చెట్లు అందమైన పూలమొక్కలతో నిండి ఉంటుందని కలగంటారు. ఇక యూనివర్శిటీ హాస్టల్ అంటే ఎంతో బాగుంటుందని విద్యార్థులు భావిస్తారు. ఎంతో కష్టపడి చదివి ర్యాంకు తెచ్చుకుని ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో అడుగుపెడితే.. విద్యార్థులు అప్పటి వరకు కన్న కలలన్నీ తలకిందులవుతాయి. చుట్టూ ముళ్లపొదలు.. ఉరుస్తున్న పైకప్పులు.. పురుగులున్న నీళ్లు.. వెలగని లైట్లు తిరగని ఫ్యాన్లు చూసి విద్యార్థుతు బిత్తరపోతున్నారు.



హాస్టల్ చుట్టూ ఉన్న ముళ్లపొదలు



వర్షం నీళ్లు పోయే మార్గం సరిగా లేకపోవడంతో పాచిపట్టి మురుగుకుంటలా ఉన్న హాస్టల్ శ్లాబ్

# ఇలా అయితే.. చదివేదెలా?

- ముళ్ల పొదల మధ్య ఇంజనీరింగ్ హాస్టల్
- రాత్రి వేళ విజృంభిస్తున్న దోమలు
- పాచి పట్టిన వాటర్ ట్యాంకులు
- భవనంపై నీళ్లు నిలిచి పాచి పట్టిన వైనం
- ఉరుస్తున్న హాస్టల్ గదులు, గోడలు
- వెలగని లైట్లు తిరగని ఫ్యాన్లు
- పట్టించుకోని అధికారులు

ప్రొద్దుటూరు, ఆగస్టు7: జిల్లాలోని యోగివేమన యూనివర్శిటీకి చెందిన క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ మొదట ప్రొద్దుటూరులోని కామిశెట్టి సుబ్బారావు డిగ్రీ కాలేజీ గదుల్లో ఏర్పాటుచేశారు. ఆ తరువాత స్థానిక పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలో రెండు బిల్డింగ్‌లు నిర్మించి అక్కడికి మార్చారు. ఈ కాలేజీ నిర్మాణం జరిగి పది సంవత్సరాలు కావస్తోంది. కానీ ఇంతవరకు కాలేజీలో అన్ని బ్రాంచ్‌లకు అవసరమైన బ్లాక్‌లు ఏర్పాటు కాలేదు. కనీసం కాలేజీలోకి వెళ్లేందుకు మంచి రోడ్డు కూడా లేదు. కొంతమేరకు సిమెంటు రోడ్డు వేసి వదిలేశారు. మెయిన్ బిల్డింగులోకి వెళ్లాలంటే బురదరోడ్లలో వెళ్లక తప్పదు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అదనపు బ్లాకులకు పనులు మొదలు పెట్టినా అవి పునాది దశలోనే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్లు ఇప్పుడు పనులు మొదలుపెట్టారు.

### ముళ్లపొదల మధ్య హాస్టల్

వైఎస్సార్ ఇంజనీరింగ్ హాస్టల్ క్యాంపస్‌లో మూలన ముళ్ల పొదల మధ్య ఉంది. హాస్టల్ చుట్టూ ఏపుగా ముళ్లచెట్లు పెరిగాయి. ఈ పొదలను పందులు అడ్డాగా మార్చుకున్నాయి. చుట్టూ ముళ్లచెట్లతో రాత్రివేళ దోమలు, పురుగులు విజృంభిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. హాస్టల్ గదుల కిటికీలకు ఉన్న అద్దాలు కొన్ని పగిలిపోయి దోమలు గదుల్లోకి వస్తున్నాయి. కొందరు దోమలు రాకుండా అట్టలు అడ్డుపెట్టుకున్నారు. దాదాపు ఈ హాస్టల్లో 120 మంది విద్యార్థులు ఉంటున్నారు. హాస్టల్ గదులపైన నాలుగు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వాటికి మూతలు లేవు. వాటిని సకాలంలో శుభ్రం చేయకపోవడంతో పాచిపట్టి లోపల పురుగులు ఉంటున్నాయి. ఈ నీళ్లను నోట్లో పోసుకుంటే అనారోగ్యం పాలవ్వక తప్పదు. హాస్టల్ శ్లాబు పైన వర్షం నీళ్లు వెళ్లేందుకు సక్రమంగా వేయకపోవడంతో నీళ్లన్నీ నిలిచి పాచిపట్టి మురుగునీటి కుంటను తలపిస్తోంది. పైన నీళ్లు నిలవడంతో హాస్టల్ గదులు గోడలు ఉరుస్తున్నాయి. బాత్‌రూంలు, మరుగు దొడ్లలో అపరిశుభ్రత తాండవిస్తోంది.

### తిరగని ఫ్యాన్లు వెలగని లైట్లు

ఇంజనీరింగ్ హాస్టల్లో ఫ్యాన్లు తిరగటం లేదు. లైట్లు వెలగటం లేదు. డైనింగ్ హాలు పక్కన ఉన్న కామన్ గదిలో 8 ట్యూబ్‌లైట్లు ఉంటే అందులో ఒక్క లైటు మాత్రమే వెలుగుతోంది. హాస్టల్ గదుల్లో ఎప్పటికప్పుడు ఎలక్ట్రీషియన్ మరమ్మతులు చేయాల్సివుంది. కాలేజీకి ఎలక్ట్రీషియన్ ఉన్నా లేనట్లే ఉందని కొందరు వాపోతున్నారు. ఇంజనీరింగ్ హాస్టల్‌పై ప్రిన్సిపాల్, వార్డెన్ల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతోనే ఇంత అధ్వాన్నంగా ఉందని అంటున్నారు. కాలేజీ క్యాంపస్‌లో న్యూఅడ్మిషన్స్ జరుగుతున్నాయి. విద్యార్థులు ఇతర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులతో వచ్చి క్యాంపస్‌తో పాటు హాస్టల్ చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. కొందరు తప్పని పరిస్థితుల్లో హాస్టల్లో చేరుతున్నారు. ఇప్పటికైనా ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తాం**

ప్రిన్సిపాల్‌గా ఈ రోజే చార్జ్ తీసుకున్నాను. క్యాంపస్ అంతా తనిఖీ చేస్తాను. హాస్టల్లో విద్యార్థులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేస్తాను. కొన్ని రోజులు వ్యవధిలో అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషిచేస్తాను. అదనపు బ్లాక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే క్యాంపస్‌లో మంచి ఆహ్లాదకరమైన వాతావరణ రూపొందిస్తాం.

- జయరామిరెడ్డి ప్రిన్సిపాల్ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల



హాస్టల్ గదిలో వెలగని లైట్లు పనిచేయని ఫ్యాన్లు



వాటర్ ట్యాంకుపై మూతలేక పాచిపట్టిన దృశ్యం



హాస్టల్ పైన నీళ్లు నిలిచి తటాకాన్ని తలపిస్తున్న దృశ్యం

## మార్కెట్ యార్డు సిబ్బంది ఆత్మహత్యాయత్నం

- విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా..
- నోటీసులు ఇచ్చారంటూ ఆవేదన

పులివెందుల, ఆగస్టు 7: విధులను సక్రమంగా నిర్వహిస్తున్నా నోటీసులు ఇచ్చారని పులివెందుల మార్కెట్ యార్డులో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మహేశ్వర్‌రెడ్డి, అజార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బుధవారం మార్కెట్ యార్డులో కార్యాలయంలో పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించారు. అక్కడున్న సిబ్బంది సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నం చేశామన్నారు. గత ప్రభుత్వంలో తమకు ఉద్యోగాలు వచ్చాయని, అయితే ఏ కారణం చెప్పకుండా ఇప్పుడు తమకు నోటీసులు ఇస్తున్నారన్నారు. తమను ఉద్యోగాల నుంచి తీసేస్తే కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. 1వ తేదీన ఒక నోటీసు ఇచ్చారని, ఇందుకు సంబంధించి సంజాయిషీ కూడా ఇచ్చామన్నారు. ఏ తప్పు చేయలేదని, తమ రికార్డులు కూడా పరిశీలించాలని చెప్పామన్నారు. కానీ మళ్లీ బుధవారం నోటీసు ఇచ్చారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై మార్కెటింగ్ శాఖ ఏడీ ఆజాద్ వల్లి వివరణ ఇస్తూ పులివెందులలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మహేశ్వర్‌రెడ్డి, అజార్‌ను విధుల నుంచి తొలగించారని ఉద్దేశపూర్వకంగా కార్యాలయంలో సూసైడ్ చేసుకుంటామని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వీడియోలు తీసి వాట్సప్ ద్వారా ప్రచారం చేశారన్నారు. వీరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో కొనసాగించాలని హైకోర్టును ఆశ్రయించారన్నారు. వీరిని ఔట్‌సోర్సింగ్ విధుల నుంచి తొలగించలేదన్నారు. వీరు ఉద్దేశపూర్వకంగా ఇలా చేశారని పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీధర్ తెలిపారని మార్కెటింగ్ శాఖ ఏడీ ఆజాద్ వల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ పులివెందుల మార్కెట్ సిబ్బంది మహేశ్వర్‌రెడ్డి, అజార్

## ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని ఆత్మహత్య

- మృతురాలిది గుంటూరు జిల్లా

వేంపల్లె, ఆగస్టు 7: వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో చదువుతున్న ఒంగోలు ట్రిపుల్ ఐటీకి చెందిన పీయూసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జమేసి ఖురేషి (17) ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ గదిలోని బాత్‌రూములో తాగునీటి పైపునకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఇడుపులపాయ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రంగారావు తెలిపారు. సెల్‌ఫోన్ వ్యవహారంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు మందలించి తల్లిదండ్రులకు తెలియజేశారనే మనస్థాపంతో ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసులు, ట్రిపుల్‌ఐటీ అధికారులు వెల్లడించిన వివరాలు..

గుంటూరు జిల్లా చీరాల గ్రామానికి చెందిన కూలి మక్బుల్ బాషా, నసీన దంపతుల కుమార్తె జమేసి ఖురేషికి 10వ తరగతిలో మంచి మార్కులు రావడంతో గత ఏడాది ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో ఆ విద్యార్థినికి సీటు వచ్చింది. ప్రస్తుతం ఇడుపులపాయ క్యాంపస్‌లో ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి తరగతులు జరుగుతున్నాయి. పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం క్యాంపస్ ఆవరణలోని క్యాంటీన్ వద్దకు వెళ్లిన సమయంలో సీనియర్ విద్యార్థికి చెందిన ఫోన్ జమేసి ఖురేషి తీసుకున్నట్లు తెలిసి తిరిగి ఆ ఫోన్‌ను ఇప్పించారు. ఈ విషయమై ట్రిపుల్‌ఐటీ అధికారులు విద్యార్థినిని మందలించినట్లు తెలుస్తోంది. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఇమ్రాన్ విద్యార్థిని తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని తెలియజేసి క్యాంపస్‌కు రావాలని సూచించారు. రాత్రి విద్యార్థులందరూ స్టడీకి వెళ్లిన సమయంలో జమేసి ఖురేషి బాత్‌రూములోని పైప్‌లైన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. చాలాసేపు విద్యార్థిని కనిపించకపోవడంతో ట్రిపుల్‌ఐటీ ఉద్యోగులు వెతకగా బాత్‌రూములో ఉరివేసుకుని కనిపించిది. అప్పటికే మృతిచెందినట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు చెబుతున్నారు. విషయాన్ని ఇడుపులపాయ పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బుధవారం తండ్రి మక్బుల్ బాషా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఉరివేసుకుని మృతిచెందిన విద్యార్థిని జమేసి ఖురేషి

### మనస్థాపం చెంది

ఫోన్ వ్యవహారంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు మందలించడం, తల్లిదండ్రులకు సమాచారం చేరవేయడంతో జమేసి ఖురేషి అవమానంతో మనస్థాపం చెందినట్లు తెలుస్తోంది. విద్యార్థులకు తెలియడం, మరుసటి రోజు తరగతికి వెళితే ఎవరు ఏమంటారో అని భయపడినట్లు తెలుస్తోంది. తెలిసీ తెలియని వయసులో ఉన్న ఆ విద్యార్థిని ఆందోళనకు గురై క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సంఘటన జరిగాక ట్రిపుల్‌ఐటీ అధికారులు ఆ విద్యార్థిని ప్రత్యేకంగా నిఘా ఉంచి దగ్గరగా గమనించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యశాల వద్ద తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి తదితరులు మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ట్రిపుల్‌ఐటీ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రాష్ట్రపతి పాలన డిమాండ్ జగన్ పైశాచికత్వానికి పరాకాష్ట

- ఎమ్మెల్సీ రామచంద్రయ్య

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ డిమాండ్ చేయడం ఆయన పైశాచికత్వానికి పరాకాష్ట అని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నిరాధారమైన ఆరోపణలతో రాష్ట్రప్రగతి అడ్డుకోవాలనే దురాలోచనతో జగన్ ఈ విధంగా చేస్తున్నాడని పేర్కొన్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన 30 రోజుల్లోనే 36 మంది వైసీపీ నేతలు హత్యకు గురయ్యారని ఢిల్లీ వెళ్లి జగన్ ప్రచారం చేశారని, ఆ 36మంది వ్యక్తుల పేర్లు వివరాలు ఇవ్వాలని అడిగితే సమాధానం లేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయి కనుకనే జగన్ క్షేమంగా తాడేపల్లి ప్యాలెస్‌లో ఉండగలుగుతున్నారని పేర్కొన్నారు. అధికారం పోవడంతో జగన్‌కు మెంటల్ బ్యాలెన్స్ తప్పినట్లుగా ఉందని తక్షణం మంచి వైద్యుడిని సంప్రదించాలని హితవు పలికారు.



ముద్ర రుణాల రూ.3కోట్ల మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్

## నేతన్నల అభివృద్ధికి పాటు పడాలి

- ప్రతి ఉద్యోగి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలి
- కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 7: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నల అభివృద్ధికి పాటుపడాలని, ఉద్యోగులంతా విధిగా సోమవారం చేనేత వస్త్రాలను ధరించాలని కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరి ష్కార వేదిక హాల్లో జిల్లా చేనేత, జౌళిశాఖల ఆధ్వర్యంలో జాతీయ చేనేతల దినోత్సవం ఘనంగా జరి గింది. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పూలమాల వేయగా, గాంధీ చిత్రపటానికి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చేనేతలను ప్రోత్సహించి, వారిని ఉన్నత స్థితికి తీసుకు రావడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. ప్రొద్దుటూరులో తయారయ్యే దూపియానా సిల్క్ వస్త్రం, మాధవరంలో తయారయ్యే పట్టుచీరలకు మరింత ప్రచారం కల్పిస్తామన్నారు. చేనేతలకు ప్రభుత్వ పథకాలను అందించి, వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామ న్నారు. మొదట మైలవరంలో చేనేత ఉత్పత్తులను ప్రారంభించిన మీదట కడప శిల్పారామంలో శని, ఆదివారాల్లో చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత వస్త్రాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంద న్నారు. చేనేతల అభివృద్ధిలో తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం చేనేత కళాకారులను సన్మానించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా తరపున 300 మంది చేనేత కళాకారులకు మంజూరైన ముద్ర రుణాలకు సంబంధించిన రూ.3 కోట్ల మెగా చెక్కును కలెక్టరు చేతుల మీదుగా లబ్ధిదారు లకు అందించారు. తొలుత జేసీ అదితిసింగ్ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్టేట్ గెస్ట్‌హౌస్ వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభిం చారు. జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి నాగరాజారా వు, ఎల్‌డీఎం జనార్ధన్ రావు, జిల్లా సహకార అధికారిని సుభాషిణి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, చేనేత ఐక్య వేదిక అవ్వారు మల్లి కార్జున, ఇతర జిల్లా అధికారులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.



జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీలో జేసీ తదితరులు

## హెల్మెట్ ప్రాణానికి కవచం

- ప్రతి ఒక్కరూ తప్పక ధరించాలి
- జిల్లా ప్రధాన జడ్జి



హెల్మెట్ వాడకంపై మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) ఆగస్టు 7: హెల్మెట్ ప్రాణానికి కవచం లాంటిదని ద్విచక్ర వాహనదారులు, వారితో పాటు ప్రయాణించే వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన జడ్జి, డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్ జి.శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ ఉపయోగంపై అవగాహన సదస్సు నిర్వహించి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా అన్ని వర్గాలకు చెందిన వారికి 1700 హెల్మెట్లను, 50 వీల్ చైర్లను ఉచితంగా పంపిణీ చేయించామన్నారు. మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను ఉపయోగించాలన్నారు.

కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ అన్నిటికంటే ప్రాణం చాలా విలువైందన్నారు. రోడ్డు ప్రమాదాల నుంచి సురక్షితంగా ఉండాలంటే హెల్మెట్ తప్పక వాడాలన్నారు. న్యాయసేవాధికార సంస్థలు చేపట్టే కార్యక్రమాల విజయవంతానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగం ముందుంటుందన్నారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయవిజ్ఞాన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్స్‌ను ఉచితంగా పంపిణీ చేయించడంపై పోలీస్‌శాఖ ప్రత్యేకమైన అభినందనలు తెలుపుతోందన్నారు. హెల్మెట్ ధరిస్తే చెమట పడుతుందని, జుట్టు రాలుతుందని, గ్లామర్ తగ్గుతుందని చాలా మంది ధరించడం లేదన్నారు. హెల్మెట్ మన ప్రాణానికి కవచంలాంటిదని తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.1000 నుంచి రూ.5000ల వరకు ఫైన్ ఉంటుందన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలలో మొదటి, నాల్గవ అదనపు, ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.దినబాబు, షేక్ ఇంతియాజ్ ఆహమ్మద్, ఆయా కోర్టుల జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. గుర్రప్పనాయుడు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్, డిజేబుల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిశోర్, పలు ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ కళాలల విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# అమ్మపాలే... బిడ్డకు అమృతం



- పోత పాలతో పుట్టెడు రోగాలు
- పాలిస్తే అందం పోతుందన్న బెంగలో మోడ్రన్ తల్లులు
- పాలివ్వకపోతే బ్రెస్ట్ క్యాన్సర్ తప్పదంటున్న వైద్యులు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 7: పుట్టినప్రతి బిడ్డకు అమ్మపాలే అమృతం. పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలే సకల రోగాలకు రక్ష. కానీ నేటి తరం తల్లుల్లో 40 శాతం మంది బిడ్డలకు పాలివ్వకుండా మోడ్రన్ తల్లులుగా మారుతున్న తీరు వైద్యశాఖను కలవర పెడుతోంది. పాలిస్తే అందం, చందం తరుగుతుందనే అపోహల నడుమ బిడ్డలు తల్లిపాలకు దూరమవుతున్నారు. దీంతో బిడ్డకు పోతపాలు రోగాలు తెచ్చి పెడుతుండగా, పాలివ్వని తల్లులు పేగు బంధం కోల్పోతున్నారనే వాదన వైద్యుల్లో ఉంది. అంతే కాకుండా తల్లి ఆరోగ్యం కుదురుగా ఉండక పోగా.. బ్రెస్ట్ క్యాన్సర్, యుట్రిక్ క్యాన్సర్ల బారిన పడే వారిలో పోతపాల మోడ్రన్ తల్లులే ముందు వరస లో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు తేల్చింది. దేవతలకు సంజీవినిగా చెప్పుకొనే అమృతం ఎలాగో... పుట్టిన బిడ్డకు అమ్మపాలు అమృతం కంటే ఎక్కువే. డబ్ల్యుహెచ్ఓ ఆదేశాల మేరకు.. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 1న కలెక్టర్ లోతేటి శివశంకర్ అమ్మపాలే బిడ్డకు అమృతం అంటూ రిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రచారాన్ని ప్రారంభించడం, వైద్యశాఖ ఐసీడీఎస్ సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయడం శుభ పరిణామం.

### ముద్దుపాల బిడ్డకు.. ముర్రుపాలే మొదటి టీకా

అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి మొదటగా ఇచ్చే ముర్రుపాలే సకల రోగ నివారిణి. తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరిగి.. వ్యాధుల బారిన పడరు. అంతేకాకుండా డయేరియా, ఊపిరితిత్తులు, ఇతర వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువే అంటారు. పుట్టిన మొదటి గంటలో తల్లిపాలే బిడ్డకు మొదటి టీకాగా ఉపయోగపడుతుంది. తల్లి పాలకు ప్రత్యామ్నాం లేదనే విషయం చాటి చెప్పేలా.. తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం పాలిచ్చే తల్లులందరికీ మనందరం మద్దతు ప్రకటించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. ఇకపోతే ముర్రుపాలు పుట్టిన బిడ్డకు జీర్ణం కాదనేది అపోహ మాత్రమే అని చెబుతున్నారు వైద్యులు. లైప్రోజ్ ఎంజైమ్ ద్వారా అరుగుదల సులభమంటారు. డబ్బా, గేద పాలు తాగించడం వల్ల ఊబకాయం (ఒబిసిటీ), షుగర్ వ్యాధులు వచ్చే అవకాశలు ఎక్కువ.

### పాలివ్వని తల్లులకే బ్రెస్ట్ కాన్సర్

పుట్టిన బిడ్డకు పాలివ్వని తల్లులకే ఎక్కువగా బ్రెస్ట్ కాన్సర్, గర్భాశయ( యుట్రిన్) క్యాన్సర్‌లు వచ్చే అవకాశలు ఎక్కువంటున్నారు వైద్యులు. ఇప్పటికే ఈ వ్యాధి బారి న పడిన వారి వివరాలను సేకరించి వైద్యశాఖకు తెలిపేందుకు అంగన్వాడీ, ఆశాలు, ఏఎన్ఎంలతో కూడిన బృందం త్వరలో లెక్కలు తీయనున్నారు. తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వల్ల ఆక్సోసిన్ హార్మోను విడుదలతో క్యాన్సర్‌ను కట్టడి చేయవచ్చు.

> **ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం..**
>
> తల్లిపాలు పుట్టిన ప్రతి బిడ్డకు అమృతం లాంటివి, బిడ్డ పెరుగుదలకే కాదు మెదడు చురుకుదనంగా ఉంటుంది. నవ జాత శిశువుకు తల్లి పాలే శ్రేష్ఠం. గేదేపాలు, డబ్బాపాలతో అనారోగ్య సమస్యలు తప్పవు. చాలా మంది తల్లులు అందచందాలంటూ బిడ్డలకు పాలివ్వకుండా పోతపాలతో సరిపెడుతున్నారు. పాలిస్తే అందం పెరుగుతుంది కానీ తరగదనే విషయాన్ని ప్రతి తల్లి గమనించాలి.
>
> *-డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి*

కాన్పు అయిన వెంటనే బిడ్డకు పాలివ్వకపోతే శ్వాస, శారీరక, బ్రైన్, భవిష్యత్తులో స్థూలకాయం, సుగర్ వ్యాధు సమస్యలు వచ్చే ప్రమాదాలెక్కువని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనర్హం

### బిడ్డకు 6 నెలల పాటు అమ్మపాలే...

పుట్టిన ప్రతి బిడ్డకు 6 నెలలపాటు అమ్మ పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు ఆరోగ్య సమస్యలతో పాటు తల్లికి ఎలాంటి వ్యాధుల సమస్యలు ధరి చేరవు. ఇక పోతే కొందరు తల్లుల్లో పాలు పడక పోవడం వల్ల ఆందోళనకు గురవుతుంటారు. అలాంటివారు పదేపదే బిడ్డకు పాలిచ్చేందుకు వెనుకాడకూడదని, క్రమం తప్పకుండా తాగించడం, పోషక విలువలతో కూడిన ఆహారం తినడం వల్ల ఆటోమేటిక్‌గా పాల ఉత్పత్తి పెరుగుతుందంటారు.

## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి : డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అనురాధ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: బడి ఈడు పిల్లలు వంద శాతం బడిలోనే ఉండాలని జిల్లా విదాశాఖాధికారి అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరం జయనగర్ కాలనీ బాలికోన్నత పాఠశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాను డ్రాప్ అవుట్స్ రహిత జిల్లాగా మార్చాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టీచర్ ఇన్ ఫర్మేషన్ సిస్టంలో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. యూడైస్‌లో లోటుపాట్లను సవరించి ఖచ్చితమైన వివరాలు తయారు చేయాలన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు దశరథరామిరెడ్డి, ఇలియాస్‌ఖాన్, లక్ష్మీనరసింహ రాజు, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, రామాంజనేయరెడ్డి, రమణమూర్తి, బ్రహ్మానందరెడ్డి, జాలాపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో-2 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చిట్టిబాబు, సునీల్‌కుమార్





చిట్టిబాబు, సునీల్‌కుమార్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: ఎంఈవో-2 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మైలవరం మండలం ఎంఈవో-2 బత్తిన చిట్టిబాబు, బి.కోడూరు మండలం ఎంఈవో-2 ఎం.సునీల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం కడప నగరం జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎంఈవో-2 సంఘం సమావేశం నిర్వహించి.. నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా సి.రఘురాములు, ఉపాధ్యక్షులుగా బి.ప్రమీల, కార్యదర్శులుగా జీవీ సుభాషిణి, నిర్మల, కోశాధికారిగా సత్యనారాయణ, స్టేట్ కౌన్సిలర్లుగా వంశీక్రిష్ణ, గంగాధర్‌నాయక్‌లను ఎంపిక చేశారు.

## ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్



రోగి కడుపులో నుంచి తీసిన కణితులు

రాయచోటిటౌన్, ఆగస్టు 7: స్థానిక ప్రాంతీయ వైద్యశాల వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి రికార్డు సృష్టించారు. ప్రముఖ వైద్య నిపుణులు సీనియర్ సివిల్ సర్జన్ డీ.లక్ష్మిప్రసాద్ ఆధ్వర్యంలోని వైద్య బృందం కడుపునొప్పితో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన ఒక నిరుపేద రోగిని పరీక్షించి శస్త్రచికిత్స చేయక పోతే ప్రాణాలకే ప్రమాదమని నిర్ధారణకు వచ్చారు. శస్త్రచికిత్స కోసం బెంగుళూరు, మద్రాసు, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి రోగికి ఆర్థిక స్తోమత లేదని గుర్తించిన వైద్యులు తమవద్ద అందుబాటులో గల వైద్య పరికరాలతోనే ఆపరేషన్ చేసి కడుపులోని 12 కణితులను తొలగించారు. తన అనుభవ నైపుణ్యంతో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ లక్ష్మిప్రసాద్‌ను తోటి వైద్యులతో పాటు ఆసుపత్రి సిబ్బంది రోగి కుటుంబ సభ్యులు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 7: మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీ కృష్ణ ఐటీఐ కాలేజీ దగ్గర ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మాధవరంపోడుకు చెందిన కిరణ్‌కుమార్ రెడ్డి(23) మృతి చెందాడు. రైల్వేకోడూరు సీఐ టి.బాబు వివరాల మేరకు... మాధవరంపోడు దిగువ పంచాయతీకి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఉపాధి కోసం కువైత్‌కు వెళ్లి రెండు రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు. బుధవారం పని నిమిత్తం కోడూరుకు వచ్చి తిరిగి తన బైకులో మాధవరంపోడు వెళుతుండగా.. కడప వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహన్ని రైల్వేకో డూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలు ముకున్నాయి.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతి చెందిన చిన్నక్క

మైదుకూరు రూరల్ ఆగస్టు 7: మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని లింగాలదిన్నె గ్రామంలో ధనికెల చిన్నక్క (39) బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామస్థుల వివరాల మేరకు.. మంగళ వారం రాత్రి వర్షం కురవడంతో చిన్నక్క తమ పొలం చూసేందుకు వెళ్లింది. ఆసమయంలో నీళ్లు తాగేందుకు బోరు వద్దకు వెళ్లగా.. కరెంటు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఈమెకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గొడ్డలితో దాడి - వ్యక్తికి గాయాలు



జమ్మలమడుగు, ఆగస్టు 7: జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీ వద్ద బుధవారం ఉదయం టీడీపీ కార్యకర్త వెంకటనారాయణపై వైసీపీ కార్యకర్త నానుబాల రాయల్ కిరణ్ గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటనారాయణ తలకు తీవ్ర గాయమైంది. జమ్మలమడుగులో పెన్నా పరిసర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయాన్నే కోవెలకుంట్ల రోడ్డులో అర్బన్ పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై పోలీసులకు నీవు సమాచారం ఇచ్చావంటే. నువ్వే ఇచ్చావని వెంకటనారాయణ, రాయల్‌కిరణ్‌లు పోలీసు స్టేషన్ ఎదుటే గొడవకు దిగారు. అక్కడి నుంచి వెంకటనారాయణ ఇంటికి వెళుతుండగా రాయల్‌కిరణ్ గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. జరిగిన ఘటనకు సంబంధించి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 'వైసీపీ నిర్లక్ష్యం చేనేతలకు శాపం'

సింహాద్రిపురం, ఆగస్టు 7: వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చేనేతలు అనేక రకాల లబ్ధిని కోల్పోయారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం సింహాద్రిపురం చౌడేశ్వరి దేవాలయంలో చేనేతలను సన్మానించారు. ఈ సందర్భంగా చేనేతల పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా... సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్క రించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్సీ మోర్చా నల్లప్ప, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరి రక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జంగం రాజేంద్ర ప్రసాద్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 7: బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సంగం రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ వీసీహాల్లో స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బాలల హక్కులు, వారి కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ విధులను, ఆవశ్యకతను తెలిపారు. వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపాల్స్, పిల్లల పట్ల సున్నితత్వంతో మెలగాలన్నారు పిల్లల సంరక్షకులే కాకుండా ఇతరులు పిల్లలను చూడడానికి వస్తే వారికి అనుమతిని నిరాకరించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు గుర్తించిన వెంటనే బాలల పరిరక్షణ విభాగానికి తెలపాలన్నారు. రాజ్యాంగం ద్వారా బాలలకు ప్రత్యేకంగా హక్కులు కల్పించారని, సమాజ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు సైతం ఎప్పటికప్పుడు కొత్తగా బాలల కోసం చట్టాలను రూపొందిస్తూ అమలు చేస్తున్నాయన్నారు. సంరక్షణ కేంద్రాలు సొంత బిడ్డల్లాగా చూసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పిల్లల సమస్యల కోసం 198, మహిళల సమస్యల కోసం 181 టోల్‌ఫ్రీ నెంబర్లు అందుబాటులో ఉంచామని, ఆ నెంబర్లకు పోన్ చేస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. బాలల, మహిళల హక్కుల చట్టాలపై మండల, డివిజన్‌స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బాలల సంక్షేమ సమితి చైర్మన్ సాంబ శివరావు మాట్లాడుతూ బాలలరక్షణ, సంరక్షణ కోసం పని చేస్తున్నపుడు సానుభూతితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సుభాష్, డీఈఓ అనురాధ, డీడీ సరస్వతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## విద్యుత్ అంతరాయాలను పూర్తిగా నివారించాలి : ఎస్ఈ



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ రమణ

బద్వేలు, ఆగస్టు 7: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా విద్యుత్ సిబ్బందితో మరమ్మతులు చేయించుకోవాలని ఎస్ఈ ఎస్.రమణ సూచించారు. బద్వేలు, గోపవరం, అట్లూరు, బ్రహ్మంగారిమఠం మండలాల అధికారులు, సిబ్బందితో బద్వేలులోని విద్యుత్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లూజులైన్‌లు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు గుర్తించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎత్తైన లోడుతో వెళ్లే వాహనదారులు పైనున్న లైన్లను గమనించి జాగ్రత్తగా వెళ్లాలని, విద్యుత్ పనులు చేసేటపుడు సిబ్బంది విధిగా భద్రతా నియమాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ఫ్యూజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం వంటి పనుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉంటే సమస్యను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల సమస్యలు పరిష్కరించి సంస్థపై వారి సంతృప్తికర స్థాయిని పెంచేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. అంతకు ముందు ఆయన పలు సబ్‌స్టేషన్లను పరిశీలించారు. సమావేశంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుళ్లాయప్ప, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విజయ్‌కుమార్, రమణ, రవి, శంకర్, చిన్నయ్య, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈనెలాఖరు లోపు ఇ-క్రాప్ పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త సాయిమహేశ్వరి

పులివెందుల రూరల్, ఆగస్టు 7: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులోని పాత ఏడీఏ కార్యాలయంలో అన్ని మండలాల ఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు, పంటల సాగు లో పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి రోజు పొలాలు పరిశీలించి సమస్యలు తెలు సుకొని పరిష్కరించాలన్నారు. డీఏఓ ఆఫీస్ ఏడీఏ డి.రమణారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, ఏరువాక కేంద్రం కోఆర్డి నేటర్ అంకయ్య మాట్లాడారు. సాగులో ఉన్న వివిధ రకాల పంటలలో ఉన్న సమ స్యలు, పరిష్కారాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వివిధ పంటలలో పాటించాల్సిన పద్ధతులను, భూసార పరీక్ష ఆధారంగా పోషకాలు ఎలా ఇవ్వాలనే అంశాలను తెలియజేశారు. ప్రస్తుత వాతా వరణ పరిస్థితులలో పంట యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పలు పంటలకు సోకే తెగుళ్లు, ఆశించే దోమలు, పురుగుల నివారణకు వాడాల్సిన మందులు, పిచికారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఓలు సునీల్‌కుమార్‌రెడ్డి, నాగభూషణం రెడ్డి, చెన్నారెడ్డి, నాగలక్ష్మి, రమేష్, రాజేంద్ర ప్రసాద్, నవంత్‌బాబు, డివిజన్‌స్థాయి రైతుసేవా కేంద్ర ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## చర్చి కోసం పది ఎకరాల గుట్ట మాయం

- వైఎస్ కుటుంబ సభ్యుని అండదండలతోనే కబ్జా
- నకిలీ పత్రాలతో అధికారులకు టోకరా
- దర్జాగా షెడ్ల నిర్మాణాలు
- పనులు ఆపేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు



అక్రమంగా జరుగుతున్న చర్చి నిర్మాణ పనులు

పులివెందుల టౌన్, ఆగస్టు 7: చర్చి నిర్మాణం పేరుతో 10 ఎకరాల గుట్టను మాయం చేసిన సంఘటన పులివెందుల మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. వైఎస్ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి అండదండలతోనే ఈతతంగం జరిగినట్లు సమాచారం. పులివెందుల మున్సిపల్ పరిధిలోని కదిరి రోడ్డు డంప్‌యార్డు వద్ద ప్రధాన రహదారికి సమీపంలో సర్వే నెంబర్ 313/1లో దాదాపు వంద ఎకరాలు ఉన్న గుట్టలో పది ఎకరాలను యంత్రాల సహాయంతో చదును చేసి షెడ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఇక్కడ చర్చి నిర్మాణం, భోజన సదుపాయాల కోసం షెడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. ఇందుకు స్థానిక అధికారులు కూడా కబ్జాదారులకు అండగా నిలిచారు. ఈ ఆక్రమణల గురించి ప్రస్తుత కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లడంతో ఆయన స్పందించి.. స్థానిక రెవిన్యూ డివిజన్ అధికారితో పాటు తహసీల్దార్‌కు వెంటనే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ప్రదేశానికి వెళ్లి నిర్మాణాలను ఆపివేశారు. ప్రతిరోజు నిర్మాణ పనులు చేపట్టకుండా నాలుగు రోజుల నుంచి వీఆర్‌ఏలను షిఫ్టుల వారీగా కాపాల కోసం డ్యూటీ వేశారు.

### చర్చి నిర్మాణ పనులు నిలిపివేశాం - ఆర్డీఓ

చర్చి అక్రమ నిర్మాణాల నిలిపివేత గురించి ఆర్డీఓను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేశామని సమాధానం ఇచ్చారు. ఈ నిర్మాణాల గురించి గతంలోనే ఆరా తీయగా.. మాకు పత్రాలు ఉన్నాయని చెప్పారని, కానీ కలెక్టర్ ఆదేశాలతో నిర్మాణ పనులు చేపడుతున్న వారు అందించిన పత్రాలను పరిశీలించగా నకిలీవని తేలాయని, దీంతో వారు ప్రభుత్వ ధరల ప్రకారం లీజుకు తీసుకుంటామని అడుగుతున్నారన్నారు. నకిలీపత్రాల గురించి ఉన్నతా, దికారులకు సమాచారం అందించామని.. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు.

## ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు

ఖాజీపేట, ఆగస్టు 7: ఖాజీపేటలో బుధవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఏకంగా పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనానికి యత్నించారు. ఏటీఎంలోకి వెళ్లగానే సీసీ కెమెరాలకు స్టిక్కర్లు అతికించి.. ఏటీఎం ముందుబాగం డోరు తొలగించేందుకు ప్రయత్నం చేయగా సైరన్ మోగడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. అంతలోపు ఎదురుగా ఉన్న ఇంటి యజమాని బయటకు రావడంతో దొంగ పరారీ అయ్యాడు. ఈ లోపు రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ విషయం ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ కిశోర్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా బ్యాంకు సిబ్బందిని అక్కడకు పంపి పరిశీలించి డబ్బులు పోలేదని చెప్పడంతో ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి ఎస్ఐ మద్దిలేటి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

# నిరసనలు జయప్రదం చేయండి

వామపక్ష కార్మిక రైతు సంఘాల నేతలు



సమావేశంలో రైతు సంఘం నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 7: కార్పొరేట్ కంపెనీల నుంచి రైతులు, వ్యవసాయాన్ని కాపాడాలని, 9న జిల్లా వ్యాప్తంగా క్విట్ ఇండియా డే నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు వామపక్ష కార్మిక రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి దస్తగిరిరెడ్డి ప్రకటించారు. బుధవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల నుంచి రైతులు, వ్యవసాయాన్ని కాపాడాలని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు దేశం విడిచి వెళ్లాలంటే 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో రైతుల వ్యవసాయన్ని కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీలు లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లాలంటూ 'కార్పొరేట్ క్విటా ఇండియా' నినాదంతో దేశవ్యాప్తంగా నిరసనలు చేయాలని పిలుపు నిచ్చిందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్ను భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలని కోరారు. 9న జరిగే నిరసన ప్రదర్శన జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా నేతలు బాదుల్లా, చంద్రరెడ్డి, మద్దిలేటి, లింగన్న, రైతు సంఘం జిల్లా నాయకులు గోపాలక్రిష్ణయ్య, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణ కోసం ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

చెన్నూరు, ఆగస్టు 7: మేజరు పంచాయతీ చెన్నూరులో ఇటీవల దోమలు ఎక్కువవడంతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. పైగా అడపా దడపా కురిసే వర్షాలతో వీధుల్లో డ్రైనేజీ కాల్వల్లో మురికినీటి గుంటల్లో వర్షంనీరు నిలిచి దోమలు విజృభన ఎక్కువకావడంతో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 9 వరకు వీధుల్లో ఫాగింగ్ చేస్తామన్నారు. కొద్దిరోజులుగా ప్రభుత్వ వైద్యశాలలో జ్వరపీడితులు పెరుగుతున్నారన్నారు. దీంతో ప్రజలు దోమల బెడద ఎక్కువగా ఉందని పంచాయతీ దృష్టికి తేవడంతో ప్రతి సందులో మురుగు కాల్వలు, మురుగునీటి గుంటలున్న చోట ఫాగింగ్ చేస్తామన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలు శుభ్రం చేయాలని, దోమతెరలు వాడాలని అన్నారు.

# డిప్యూటీ డీఎంహెచ్ఓపై కేసు నమోదు చేయాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బానోతుచిన్నమ్మ

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 7: కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నర్సు భానోతి చిన్నమ్మను అన్నమయ్య డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నక్రిష్ణ పెళ్లి చేసుకుని వదిలేసి చంపడానికి ప్రయత్నించాడని అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు న్యాయం చేయాలంటూ బుధవారం కడప కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సర్వజన ఆస్పత్రిలో బంజారా మహిళ భానోతి చిన్నమ్మ నర్సుగా పనిచేస్తోంది. ఆమెను అన్నమయ్య జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నక్రిష్ణ పెళ్లి చేసుకుని వదిలేసి చంపడానికి ప్రయత్నించాడని ఆరోపించారు. అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. చిన్నమ్మకు న్యాయం చేయాలని చెన్నక్రిష్ణను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి రక్షణ కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందించారు. నిరసనకు సంఘీభావంగా సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి, బంజారా సేవా సంఘం నేత జగన్నాయక్, ఏపీ గిరిజన సంఘం నేత అంకుశం, దళిత హక్కుల పోరాట సమితి నేతలు, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

200 హెల్మెట్లను పంపిణీ చేసిన దాల్మియా భారత్ ఫౌండేషన్


హెల్మెట్లను పంపిణీ చేసిన దాల్మియా భారత్ లిమిటెడ్ సిబ్బంది

కడప(కలెక్టరేట్) ఆగస్టు7: సామాజిక భద్రతను పెంపొందిస్తూ వాహనదారుల్లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడం అవసరమని దాల్మియా ఫౌండేషన్ కడప యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా పిలుపు నిచ్చారు. సామాజిక భద్రతలో భాగంగా రోడ్డుప్రమాదాల నివారణపై దాల్మియా భారత్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లు కలెక్టరేట్ నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్సు కలిగిన 200 మందికి హెల్మెట్లను పంపిణీ చేశారు అనంతరం సీఎస్ఆర్ బృందం 100 హెల్మెట్లను కలెక్టర్ శివశంకర్‌కు అందించారు. మిగతా హెల్మెట్లను సమీప గ్రామాల్లో అర్హులకు పంపిణీ చేశారు. ర్యాలీలో రోడ్డు భద్రతలో భాగంగా తీసుకోవాల్సిన అంశాలతో కూడిన కర పత్రాలను పంపిణీ చేశారు. ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. సామాజిక బాధ్యతను పౌరులకు చాటి చెప్పేందుకే అవగాహన ర్యాలీలు చేస్తూ వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులు, కమ్యూనిటీ సభ్యులు సహకారం సంతోషమన్నారు.

## మోదీ విధానాలు ప్రమాదకరం : ఏఐటీయూసీ

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 7: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాత విధానాలు కార్మికవర్గానికి సామాన్య ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. బుధవారం హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగులేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా మార్చిందన్నారు. సమావేశంలో ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసు బ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున రెడ్డి, జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఉపాధ్యక్షురాలు మంజుల, లింగన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనలు తుంచి నాటాలి : ఏడీఏ

కమలాపురం రూరల్, ఆగస్టు 7: వరి నాట్లలో ప్రతి రైతు కొనలను తుంచి నాటితే ఉపయోగకరంగా ఉంటుందని ఏడీఏ నరసింహారెడ్డి సూచించారు. బుధవారం మీరాపురంలో రైతు క్రిష్టారెడ్డి వరి పంటలో నిర్వహించిన పొలంబడిలో ఆయన మాట్లాడుతూ వరి నారు కొనలు తుంచి నాటితే వరిలో కాండం తొలుచు పురుగును గుడ్డు దశలోనే నివారించవచ్చన్నారు. వరిలో తప్పనిసరిగా కాలిబాటలు 2 మీటర్లకు 30 సెంమీ వదులుకుని కాలిబాటలు తీసి సుడి దోమ పురుగును నివారించవచ్చన్నారు. రైతులు ఎరువుల యాజమాన్యాన్ని చేపట్టాలని కాంప్లెక్స్ ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో కూడా పైపాటుగా వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సరస్వతి, వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు


గంగమ్మగుడి వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

సికెదిన్నె, ఆగస్టు 7: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. గంగమ్మ ఆలయం వద్ద తల్లిపేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపాధి ద్వారా చేపట్టిన కార్యక్రమంలో మొక్కలు నాటారు. అంతకుముందు ఎమ్మెల్యే గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ తమ తల్లిపేరిట మొక్కలు నాటాలని ప్రజలకు నీడనిచ్చే చెట్లు ఎక్కువగా నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు టక్కోలి వెంకటక్రిష్టారెడ్డి, గంధం మోహన్‌బాబు, గంగమ్మగుడి ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలి

ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

కడప (నాగరాజుపేట), ఆగస్టు 7: సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని, అందుకు ఆచార్య జి.పార్వతి తగిన సమర్థురాలని వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో గ్రంథాలయ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జానమద్ది హనుమచ్ఛాస్త్రి మొదలు తరువాత బాధ్యులు, సంచాలకులుగా వచ్చిన వారంతా గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేశారని అందుకు తగినట్లుగా విశ్వవిద్యాలయ అధికారులు సహకరించారన్నారు. మొదట నూతన భవన నిర్మాణం జరగాలని, ఏటా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.క్రిష్టారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు.

## విలువలు, నిబద్ధతతో ఉత్తమ సమాజం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: విలువలు, నిబద్ధత కలిగిన పౌరులు ఉత్తమ మానవ సమాజాన్ని నిర్మిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా అన్నారు. బుధవారం కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐదు రోజుల శిక్షణలో ఆయన తొలిరోజు వృత్తి విలువలు, భావోద్వేగ నియంత్రణ భావోద్వేగాన్ని ప్రభావితం చేసే వాటి గురించి వివరించారు. 'విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే' అంశంపై రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ సీఓలు, వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు.

## యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: అధిక ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న పార్మశీ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అంకన్న, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. బుధవారం పీడీఎస్‌యూ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఫార్మశీ కళాశాల యాజమాన్యం ప్రారంభం నుంచి ఏటా విద్యార్థులను అధిక ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. 2023-24 సంవత్సరాల్లో ఫార్మశీ పూర్తయిన విద్యార్థులకు ఆరునెలలైనా సర్టిఫికెట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఏఎల్ఏటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయించిన ఫీజుల కంటే క్లినికల్ ల్యాబ్, లైబ్రరీ, అటెండెన్స్, బస్, యూనివర్శిటీ డెవలప్‌మెంట్ లాంటి ఫీజుల పేరుతో పేద విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

## సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి : ఎంపీ

పులివెందుల, ఆగస్టు 7: నల్లపురెడ్డిపల్లెలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. బుధవారం ఢిల్లీలోని భారత రక్షణ ప్రభుత్వ కార్యదర్శి గిరిధర్ అరమనేని కలిసి వినతిపత్రం అందించిన ఎంపీ వివరిస్తూ దేశవ్యాప్తంగా ఎన్జీఓలు, ప్రైవేట్ పాఠశాలలు, రాష్ట్రప్రభుత్వ భాగస్వామ్యంతో 23 సైనిక్ పాఠశాలలను నెలకొల్పాలని గతేడాది మంత్రిత్వ శాఖ నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో నల్లపురెడ్డిపల్లెలో పాఠశాలను నెలకొల్పాలని నిర్ణయించారన్నారు. ఈ విద్యాసంవత్సరంలో నిధులు కేటాయించి పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## పాలకొండలో శ్రావణమాస వేడుకలు

కడప (కల్చరల్) ఆగస్టు 7: శ్రావణమాసం పురస్కరించుకుని పాలకొండలో వెలసిన పాలకొండరాయస్వామి ఆలయంలో వేడుకలు జరుగనున్నట్లు ఆలయ ఈఓ ఎ. శ్రీధర్ తెలిపారు. ఈనెల 10వ తేదీ మొదటి శ్రావణ శనివారం ఉదయం 5-30 గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకము, ప్రత్యేక అలంకారం, ఉదయం 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభమౌతుందన్నారు. కావున భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిసేవలో తరించాలని కోరారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ మార్పునకు పరిశీలన

వేంపల్లె, ఆగస్టు 7: వేంపల్లెలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ మార్పునకు అవసరమైన భవనాలను సబ్‌రిజిస్ట్రార్ హరికృష్ణ పరిశీలించారు. ప్రస్తుతం కడప-పులివెందుల బైపాస్‌రోడ్డు సమీపంలో అద్దెగదుల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవికి విజ్ఞప్తి చేశారు. దీంతో మార్కెట్‌లోని వెలుగు పాలకేంద్రం భవనాలను పరిశీలించారు.

## తపాలా సేవలను ప్రజలు అందిపుచ్చుకోవాలి

కడప (మారుతీనగర్) ఆగస్టు 7: తపాలాశాఖ ద్వారా అందుతున్న ఆర్‌డీ, ఎస్‌బీ, ఎస్ఎస్ఏ, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, ఎంఐఎస్, తదితర సేవలను ప్రజలు అందిపుచ్చుకుని జీవితాన్ని ఆనందకరం చేసుకోవాలని రవీంద్రనగర్ తపాలా కార్యాలయ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు కోరారు. తపాలా శాఖ ద్వారా ప్రజలు అందుతున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే క్రమంలో భాగంగా బుధవారం రవీంద్రనగర్ సబ్ పోస్టాఫీసులో డాక్ చోపల్ నిర్వహించారు.

## వేంపల్లె సీఐగా సురేష్‌రెడ్డి



వేంపల్లె, ఆగస్టు 7: వేంపల్లె సీఐగా సురేష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న చాంద్‌బాష కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పులివెందుల ట్రాఫిక్‌లో పనిచేస్తున్న సురేష్‌రెడ్డిని నియమించారు.

అసాంఘిక కార్యకలాపాలపైసమాచారం ఇవ్వండి

## రిమ్స్ సీఐగా సీతారామిరెడ్డి



కడప (క్రైం), ఆగస్టు 7: రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇస్తే పూర్తిస్థాయిలో కట్టడి చేసేలా చర్యలు తీసుకుంటామని సీఐ సీతారామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన రిమ్స్ పోలీసుస్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పి స్తానని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీటర్లు అనుమాని తులపై నిఘా ఉంచుతామన్నారు. ప్రస్తుతం కడప ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న ఆయన రిమ్స్‌కు బదిలీపై వచ్చారు.

## వేంపల్లె తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన హరినాథ్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న హరినాథరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 7: వేంపల్లె తహసీల్దార్‌గా అమరావతి సీసీఎల్ఏలో పనిచేస్తున్న వై.హరినాథరెడ్డి నియామకమయ్యారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడకు వచ్చిన వెంకటేశ్‌నాయక్ ఆయన జిల్లాకు వెళ్లిపోగా హరినాథరెడ్డిని నియమించారు. డీటీ శివలక్ష్మి, ఆర్ఐ లోకేష్, సర్వేయర్ శివారెడ్డి, వీఆర్వోలతో తహసీల్దార్ చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని నూతన తహసీల్దార్ తెలిపారు.

## సీకేదిన్నె తహసీల్దారుగా నాగేశ్వరరావు



సికెదిన్నె, ఆగస్టు 7: చింతకొమ్మదిన్నె నూతన తహసీల్దారుగా ఆవులేటి నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. నాగేశ్వరరావు ఎర్రగుంట్ల తహసీల్దారుగా పనిచేస్తూ ఎన్నికల విధులపై తిరుపతి జిల్లా రేణిగుంట తహసీల్దారుగా బదిలీ అయ్యారు. అనంతరం అక్కడి నుంచి చింతకొమ్మదిన్నె తహసీలుదారుగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా పాకాల తహసీల్దారు కె.పి.భాగ్యలక్ష్మి చింతకొమ్మదిన్నెకు రావడం, ఇక్కడి నుంచి తిరిగి తిరుపతికి వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన నూతన తహసీల్దారుకు రెవెన్యూ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కడప (మారుతీనగర్) ఆగస్టు 7: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సౌరకాయల శివశంకర్ పిలుపునిచ్చారు. ఈనెల 9వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ప్రజాసమస్యల వేదిక భవన్‌లో జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఆదివాసి గిరిజన సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు,విద్యార్థులు, ఆదివాసి సేవా సంఘ సభ్యులు, గిరిజన మేధావులు, పెద్ద సంఖ్యలో ఆదివాసీలు తప్పక హాజరుకావాలని కోరారు.

## వక్ఫ్‌బోర్డు చట్టసవరణ అవసరం లేదు

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 7: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేయాల్సిన అవసరం లేదని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్‌బాషా తెలిపారు. దేశంలో అతి పెద్దస్థాయిలో సంపద ఉన్న వక్ఫ్ సంస్థకు సంబంధించిన వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పలు సవరణలు చేస్తోందని కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్న నేపథ్యంలో కమిటీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్టసవరణ బిల్లును ఇండియా కూటమి మిత్రపక్ష పార్టీలన్నీ వ్యతిరేకించాలన్నారు. ఆప్‌కి ఆవాజ్ నగర అధ్యక్షులు ఆబిద్‌హుసేన్ పాల్గొన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు

కడప (మల్లి), ఆగస్టు 7: కడప నగరంలో ఓ బాలికను మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బాలిక ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కాలేజీకి వెళ్లిన బాలిక సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా మహేశ్ (22) అనే యువకుడితో పాటు బాలిక కనిపించింది. దీంతో నిందితుడిపై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసి బాలికను తల్లిదండ్రులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

## జానపద గేయాలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

వల్లూరు, ఆగస్టు 7: నవీన యుగంలో జానపద గేయాలు విన్నా, పాడినా మానసికంగా ఉల్లాసంగా ఉంటామని జనవిజ్ఞానంవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ అన్నారు. గంగాయపల్లె జడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన జానపద గేయాల పోటీల అనంతరం ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత లేని రోజుల్లోనే ఈ జానపద గేయాలు ఉన్నాయన్నారు. నిరక్షరాస్యులు గ్రామీణ ప్రాంతాల్లో తమ జీవన విధానం, వివిధ వృత్తుల్లో పనిచేసే శ్రమను మరిచిపోడానికి, పనిలో ఉత్సాహంగా ఉండడానికి జానపద గేయాలు పాడుతూ పనిచేసేవారన్నారు. భజన పోటీలు, వీధినాటకాలు ఆడేవారు చాలా తక్కువయ్యారని, అటువంటి కళాసంపద అంతరించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథరెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక ద్వారా మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం పోటీలు నిర్వహించారు. మన సంస్కృతి ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప, జేవీవీ నేతలు శంకరయ్య, వెంకటరమణ, శేఖర్, భాస్కర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు. అనంతరం పిల్లలతో కలిసి జానపద గేయాలు పాడారు.

## అర్హులకు ఆటోలు, ట్రాక్టర్లు పంపిణీ చేయాలి


నిరుపయోగంగా ఉన్న ఆటోలతో టీఆర్ఎస్‌వైఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: అర్హులైన వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటోలు ట్రాక్టర్లు వెంటనే పంపిణీ చేయాలని టీఆర్ఎస్ఎఫ్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం హోమియోపతి కళాశాల సమీప మహిళాశక్తి ప్రాంగణలో ఉన్న ఆటోలు, ట్రాక్టర్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెకనైజ్డ్ క్లీనింగ్ సంబంధించి ఎన్ఎస్‌కేఎస్, ఎన్ఎస్‌సీ, ఎఫ్‌డీసీ నిధుల నుంచి జిల్లాకు ఆటోలు, ట్రాక్టర్లును క్లీనింగ్‌మిషన్లు మంజూరు చేశారన్నారు. అయితే వాటిలో కొన్నింటిని మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేసి మిగిలిన 28 ట్రాక్టర్లను 75 ఆటోలను మహిళాశక్తి ప్రాంగణలో నిరుపయోగంగా ఉంచారని చెప్పారు. వీటిని వెంటనే అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనరు నాగేంద్రబాబు, నేతలు వెంకటేశ్, శ్రీనాధ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి


ఆర్టీసీ బస్టాండు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: కడప నగరంలో వర్షం నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలో కోటిరెడ్డిసర్కిల్ ఆర్టీసీ బస్టాండు సహా పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండులో ఉన్న నీటి నిల్వను గమనించి తక్షణమే నీటిని తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి వచ్చే వర్షం నీరు సజావుగా వెళ్లేందుకు సిల్ట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ వేణుగోపాల్, ఏఈ పవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అలవెన్స్‌లకు మోక్షం ఎప్పుడో

కడప (మారుతీనగర్) ఆగస్టు 7: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు పెండింగ్ అలవెన్స్ మొత్తాలను తక్షణమే చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేఖరులతో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఆశా కార్యకర్తలకు ఇవ్వవలసిన కరోనా, మలేరియా, టీబీ, లెప్రసీ, అలవెన్స్ మొత్తాలను ప్రభుత్వం విడుదల చేసినట్లుగా రాష్ట్ర స్థాయి అధికారులు చెప్పినా ఇంతవరకూ చెల్లించలేదన్నారు.

## 75 మందికి కంటి పరీక్షలు

వేముల, ఆగస్టు 7: వేముల పీహెచ్‌సీలో 75కి కంటిపరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ ఆఫ్రిన్ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీలో కడపకు చెందిన పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, మాత్రలు అందించారు. ఆపరేషన్ అవసరమైన వారికి పుష్పగిరి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్మలమడుగు డీఎస్పీగా హుస్సేన్‌పీరా

జమ్మలమడుగు, ఆగస్టు 7: జమ్మలమడుగు డీఎస్పీగా జి.హుస్సేన్‌పీరా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపురంజిల్లా జంతలూరుకు చెందిన ఈయన 1991లో ఎస్ఐగా ఆలూరులో పనిచేశారు. 2008లో సీఐగా నంద్యాల తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. 2014లో డీఎస్పీగాకర్నూలులో, అనంతపురం పీటీసీలో పనిచేశారు. ప్రస్తుతం జమ్మలమడుగు డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ యశ్వంత్ బదిలీపై వెళ్లారు.

## మైదుకూరు తహసీల్దార్‌గా రాజసింహ నరేంద్ర

మైదుకూరు రూరల్ ఆగస్టు 7 : మైదుకూరు నూతన తహసీల్దార్‌గా రాజసింహ నరేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు .ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆయన ఎన్నికల నిమిత్తం తిరుపతి సమీపంలోని వడమాలపేట మండలం లో పనిచేస్తు మైదుకూరుకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

## 'ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం'

మైదుకూరు రూరల్ ఆగస్టు 7 :గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో అసంపూర్తి పనులపై ఆంధ్రజ్యోతిలో పేదల కోసమా...కాంట్రాక్టర్ల కోసమా అనే కథనంపై స్పందించిన హౌసింగ్ డీఈ గోపాలకృష్ణ బుధవారం కాలనీని పరిశీలించారు. కథనంలో పేర్కొనట్లు పట్టు మని పది ఇండ్లు కూడా పూర్తి కాలేదని గమనించారు. ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయిస్తామని తెలిపారు. కాలనీలో మౌలికవసతులను కల్పిస్తామన్నారు.

## కొండాపురం సీఐగా మహ్మద్‌రఫీ

కొండాపురం, ఆగస్టు 7 : కొండాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా పి. మహమ్మద్ రఫీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన సీఐడీ ఇన్‌స్పెక్టర్ గాను, అనంతపురం జిల్లాలో పలుచోట్ల ఎస్ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## టూ టౌన్ సీఐగా యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 7 : టు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా యుగంధర్ బాధ్యతలు స్వీకరించారు. అయన స్థానిక ట్రాఫిక్ సీఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న అబ్దుల్ కరీం కడపకు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

## 11న వాసవీ ప్రతిష్ఠ

ప్రొద్దుటూరు టౌన్ ఆగస్టు 7: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 11వ తేదీ ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠచేస్తున్నట్లు ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 5.30 గంటలకు సుప్రభాతసేవ, మంగళహారతి, 7 గంటలకు గణపతి, నవగ్రహ, రుద్ర, చండీహోమాలు నిర్వహిస్తామన్నారు. 12 గంటలకు అమ్మవారు వజ్రపు కిరీటం, వజ్రపు చీరెతో అలంకరించి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

## తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 7: తహసీల్దార్ శోభన్‌బాబును టీడీపీ నాయకులు బుధవారం కలిశారు. శాలువతో సన్మానించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఎస్.సంజీవరెడ్డి, మండల కన్వీనర్ మేకల మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు రమేష్‌నాయుడు, నాగభూషన్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.



## వర్షం పలకరింత.. పుడమి పులకింత

రెండు నెలలుగా రైతులను ఊరించిన మేఘం ఎట్టకేలకు మంగళవారం రాత్రి కరుణించింది. దేశ వ్యాప్తంగా వరదలు ముంచెత్తుతున్నా.. జిల్లాలో వర్షం చుక్క కరువవడంతో ఆశలు వదులుకున్న రైతులు ముందస్తుగా సాగు చేసిన మినుము పైరును నిలువునా దున్నేశారు. మళ్లీ పొలాలను సిద్ధం చేసుకుని ఎదురుచూస్తున్న తరుణంలో కురిసిన వర్షం వారి ఆశలకు ఊపిరిపోసింది.


రాజుపాలెంలో కురుస్తున్న వర్షం


జమ్మలమడుగులో జలమయమైన రహదారి


పోరుమామిళ్ల: మైదుకూరు రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

**రాజుపాలెం :** మండలంలో మంగళవారం రాత్రి 54.4 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భూముల్లో తేమశాతం పెరగడంతో కంది, పత్తి, మినుము సాగు చేసుకునేందుకు అనకూలంగా మారిందంటున్నారు. దీనికి తోడు చాపాడు కెనాల్‌కు నీళ్ల రావడంతో నారుమళ్ల పోసుకునేందుకు ఈ వర్షం ఉపకరించింది. నిన్న మొన్నటి వరకు వర్షం లేక ఎండిపోతున్న పొలాలకు ఈ వర్షం అన్నివిధాలుగా ఉపయోగపడుతుంది. ఖరీఫ్‌లో దాదాపు 10వేల ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉంది

**జమ్మలమడుగు:** జమ్మలమడుగులో మంగళవారం రాత్రి సుమారు గంటకుపైగా వర్షం కురిసింది. పొలాల్లో సేద్యం చేసి రెండు నెలలుగా ఎదురు చూస్తున్న రైతుల్లో ఈ వర్షం ఆనందం నింపిందిదద. జమ్మలమడుగు పట్టణంలోని మూడు రోడ్ల కూడలి వద్ద మోరగుడి, మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు, భాగ్యనగర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచింది. . బుధవారం సాయంత్రం దాకా మేఘాలతో చిరుజల్లులు అప్పుడప్పుడు కురిశాయి.

**పోరుమామిళ్ల :** పోరుమామిళ్లలోని ప్రధాన రహదారులు బురదమయం అయ్యాయి. మైదుకూరు రోడ్డులో వర్షం నీరు రోడ్డుపై ప్రవహించడంతో రంగసముద్రం, గురప్పగారిపల్లెకు చెందిన ప్రజలు కమ్మవారిపల్లె మీదుగా పోరుమామిళ్లకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఆ ప్రాంతంలో ఉన్న కాల్వలను పూడ్చివేయడంతో రోడ్డుపై ప్రవహించింది. ఆర్టీసీ బస్టాండులో గుంతల్లో వర్షం నీరు చేరుకుంది. పట్టణంలోని పలు వీధుల్లో ఈ వర్షం నీరు పెరగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పదునైన వర్షం కురిసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎర్రగుంట్ల:** ఎర్రగుంట్లలో 44.0 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. పత్తి, కంది, వరి, సోయాబీన్స్ తదితర పంటలకు ఈ వర్షం ఊపిరి పోసిందని చెప్పవచ్చు. కాగా, వర్షం రాకపోవడంతో మినుము పైరును ఇప్పటికే దున్నేసిన సంగతి తెలిసిందే.

## పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

● వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలుటౌన్, ఆగస్ట 8 : మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నా, సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుధా హాజరయ్యారు. అజెండా అనంతరం మురుగుకాలువలు, పందులు, దోమల బెడద, సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేశారు. మూడేండ్లుగా శానిటేషన్ అధికారులకు, సిబ్బందికి విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. కౌన్సిల్‌లో తెలుగుదేశంపార్టీకి ప్రతిపక్షహోదా ఇవ్వాలని టీడీపీ కౌన్సిలర్ సునీత సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును ఎందుకు ప్రారంభించలేదంటూ కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. డీజిలు, పెట్రోలు పట్టించి మూడునెలలు అవుతుంటే పెట్రోలు ఆవిరైపోతుందని, ఈ నష్టానికి బాధ్యులు ఎవరని సమావేశంలో కౌన్సిలర్లు మండిపడ్డారు. దీంతో ఎమ్మెల్యే సుధ, చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహిస్తామని, త్వరలోనే పెట్రోలు బంకును ప్రారంభిస్తామన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్ సునీత, అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సుధ

## రెవెన్యూ అక్రమాలపై విచారణకు టీడీపీ డిమాండ్

బి.కోడూరు, ఆగస్టు 7 : మండలంలో గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములన్నీ ఆన్‌లైన్ చేశారని, వాటన్నింటిపైనా విచారణ జరపాలంటూ టీడీపీ నేతలు బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్నెల్లి గ్రామంలోని 767 సర్వే నెంబరులో 9 ఎకరాల 88 సెంట్లు , 793 సర్వేనెంబరులో 6 ఎకరాల 72 సెంట్లు, 775 సర్వేనెంబరులో 2 ఎకరాల 69 సెంట్లు , కొంతమంది అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుని వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందారని ఆరోపించారు. తంగేడుపల్లెలో 284/1, 284/2 సర్వేనెంబర్లలోని 8.68 ఎకరాలు, 8.64 ఎకరాల భూమి అక్కినగుండ్ల సాలమ్మ భర్త సుబ్బ రాయుడు, అక్కిన గుండ్ల రామతులసి భర్త వెంకటసుబ్బయ పేర్లతో ఉండగా, దానిని 22/ఎకింద ఆన్‌లైన్ చేశారని , బద్వేలు, పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డులో స్థానికేతరులకు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేశారని ఆరోపించారు. 2023 నుంచి 2024 మార్చి వరకు ఆన్‌లైన్‌లో నమోదైన ప్రభుత్వ భూమి వివరాలను బహిర్గతం చేసి విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన అనంతరం తహసీల్దారు అలీఖాన్‌కు వినతి పత్రం అందించారు. దీనిపై తహసీల్దారు మాట్లాడుతూ ఆరోపణలు వాస్తవం కావచ్చని, కానీ వాటిని పరిశీలించేందుకు తమ దగ్గర ఎలాంటి రికార్డులు లేవన్నారు. బద్వేలు ఆర్డీవో కార్యాలయంలో ఉన్న రికార్డులను తెప్పించి పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మద్దిరెడ్డి, నారాయణరెడ్డి, గోవిందాయపల్లె గ్రామ ప్రజలు, తంగేడుపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


తహసీల్దారు అలీఖాన్‌కు వినతిపత్రం అందిస్తున్న గోవిందాయపల్లె , తంగేడుపల్లె గ్రామస్తులు

## కాటన్ ఎగుమతి మాని కాటన్ పరిశ్రమలు పెట్టాలి

ప్రొద్దుటూరు , ఆగస్టు 7 : చేనేత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పథకాలు ఎన్నో రూపొందించినా అవి రాష్ట్రాలలో అందుబాటులోకి రావడం లేదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు ఆరోపించారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో కాటన్ ఉత్పత్తి చేసి పక్క రాష్ట్రమైన తమిళనాడుకు ఎగుమతి చేయడం మాని, ఇక్కడే పరిశ్రమలు పెడితే ఎందరికో ఉపాధి కలుగుతుందన్నారు. పవర్ లూమ్స్ కార్మికునికి సహకారం అందించి వారికి సబ్సిడీలు, విద్యుత్ రుణాలు అందజేయాలన్నారు. పంటెలు చుట్టే వారికి బుడ్లు తోడే వారికి రోజులకు 120 రూపాయలు గిట్టుబాటు కాదన్నారు. ఈ రంగంలో కనీస వేతనాలు లేవన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంత నష్టాల్లోవున్నా చేనేతరంగం ఎగుమతుల నుండే కేంద్ర ప్రభుత్వానికి 13 శాతం విదేశీ మారక ద్రవ్యం వస్తుందన్నారు. రాష్ట్రంలో చేనేతలు అధికంగా ఉండే ప్రాంతాలలో చేనేతలకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. వద్ది రమణ, నాగరాజు బీసీ నాయకులు శరత్‌బాబు, అంజీ లు పాల్గొన్నారు.

**జమ్మలమడుగు :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి ఆధ్వర్యంలో మోరగుడి మూడు రోడ్ల కూడలిలో తొలి శాసనసభ్యుడు కుండా రామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక దినోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆగస్టు 7వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాటు చేశారన్నారు. 10వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు శుభాకాంక్షలు తెలియజేసి చేనేత కార్మికులకు నేతన్న నేస్తం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చేనేత ఐక్యవేదిక జాతీయ ఉపాధ్యక్షుడు కాటా రామదాసు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చౌడం జొల్లు కొండయ్య, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కుండా రామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ చేనేత సహకార వ్యవస్థను, ఆప్కోను బలోపేతం చేయాలని చేనేత చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు పరచాలన్నారు. చేనేతల పరిస్థితి ప్రస్తుతం దుర్భరంగా మారిందన్నారు. ధరలు పెరిగి చేనేత పరిశ్రమపై నేసిన వస్త్రాలపై జీఎస్టీ వేయడంతో చేనేత వ్యవస్థ దెబ్బతినిందన్నారు. వ్యవసాయం తర్వాత రెండవ అతి పెద్ద పరిశ్రమ చేనేత అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నా చేనేతల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, చేనేతల బ్రతుకులు మెరుగుపరచాలన్నారు. అనంతరం చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ, చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేతల సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు పల్లా లక్ష్మినారాయణ, నగళ్లపాటి పాములేటి, సీతారామయ్య, వీరనాల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసుల జీవన్మరణ పోరాటాలకు మద్దతుపలుకుదాం

● విరసం రాష్ట్రమాజీ కార్యదర్శి వరలక్ష్మి

ప్రొద్దుటూరు , ఆగస్టు 7 : కార్పొరేట్‌శక్తుల వనరుల దోపిడీ కోసం ఆదివాసులను అడవుల నుంచి తరిమికొట్టే ప్రయత్నంలో వారు చేస్తున్న జీవన్మరణ పోరాటాలకు కవులు రచయితలు బుద్ధిజీవులు మద్దతు పలకాలని విరసం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మీ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సృజనా సామాజిక వేదిక కార్యాయంలో ఆదివాసుల హక్కులపై ఆగస్టు 9,10 హైదరాబాదులోని సుందరయ్య భవన్‌లో జరుగుతున్న జాతీయ ఆదివాసుల అఖిల భారత సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్ మధ్యప్రదేశ్ మహరాష్ట్రలోని దండకారణ్యంలో వున్న ఆదివాసులను భారత సైనిక బలగాలు పోలీసులు గత ఐదునెలలుగా ఎన్‌కౌంటర్ల పేర కాల్చిచంపుతున్నాయన్నారు. ఆదివాసుల జీవించే హక్కు కోసం రాజ్యాంగ హక్కులను, విలువలను కాపాడుకోవడం కోసం ప్రజాస్వామిక ఉద్యమాలు నిర్మించాలన్నారు. ఈ ఆదివాసీ ఉద్యమాలకు సంఘీబావం కూడగట్టే యత్నంలో భాగంగా మేధావులు రచయితలతో అఖిలభారత సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత న్యాయవాది దాదాహయత్, కవి ఎస్పీ మహమూద్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా సురేష్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి శక్తి నాయకురాళ్లు ప్రసన్న, హరిత పాల్గొన్నారు.

## చేనేతకు చేయూత ఇవ్వని కేంద్రం

● స్వర్ణ భారత్ ప్రజా పార్టీ అధ్యక్షుడు శిలివేరు దశరథరామయ్య

ప్రొద్దుటూరు, ఆగస్టు 7 : చేనేతలపై కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతా రామన్ ఒక్క మాట కూడా ప్రకటించకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నట్లు స్వర్ణ భారత్ ప్రజా పార్టీ అధ్యక్షుడు శిలివేరు దశరథ రామయ్య తెలిపారు. బుధవారం చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు చేనేత రంగంపై చూపుతున్న వివక్షకు నిరసనగా తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 75 ఏళ్ల గా చేనేత రంగం కోసం అమలు చేసిన పథకాలు చేనేత కార్మికుల, జీవన ప్రమాణాలు వృత్తి ప్రమాణాలు పెంచేవి కావన్నారు. చేనేత రంగం ఎదుర్కొనే సమస్యలు అసెంబ్లీ పార్లమెంటులో ప్రస్తావించాలంటే ఆ రంగం నుంచి చట్టసభలకు ప్రాతినిధ్యం పంపేందుకు రాజకీయ పార్టీలు సహకరించడం లేదన్నారు. కేవలం ముసలికన్నీరు తప్ప చేనేతలు అధికంగా వుండే నియోజకవర్గాల్లో వారికి సీట్లు కేటాయించడం లేదన్నారు. గత కొన్నేళ్లలో చేనేతలు వందలాది మంది ఆత్మహత్యలు చేసుకుంటే వారి కుటుంబాలను ఏమాత్రం ప్రభుత్వాలు ఆదుకోలేదన్నారు. చేనేతలకు సబ్సిడీ క్రింద ముడిసరుకులతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. చేనేతలకు విద్యుత్ రాయితీని కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి లోకేశ్వరీ . నాగవేణి, రాజు, రామసుబ్బయ్య క్రిష్ణా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు



## నల్లాయపల్లె భూములు పేదలకే దక్కాలి


ధర్నా చేస్తున్న పేదలు

అట్లూరు, ఆగస్టు 7 : మండలంలోని నల్లాయపల్లెలో ఉన్న ప్రభుత్వ భూములు పేదలకే దక్కాలంటూ అట్లూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట బు. దవారం వ్యవసాయ కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధా న కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు కంచె వేసి అందులో పండ్ల మొక్కలు నాటారని, వెంటనే ఆ కంచెలు తొలగించి భూమిలేని పేదలకు పంచాలంటూ వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణయ్య వెల్లడించారు. నల్లాయపల్లె ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అనంత రం అట్లూరు తహసీల్దారు రవిశంకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్ర మంలో కార్మిక సంఘం మండల నాయకులు రవిచంద్ర, మహిళా నాయకురాలు సుభద్రమ్మ, మాధవి, రత్నమ్మ పాల్గొన్నారు.

## ముగిసిన పెద్దదుద్యాల వాసుల ఆందోళన

ముద్దనూరు ఆగస్టు7:మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల గ్రామ ప్రజలు పదమూడు రోజులుగా చేస్తున్న ఆందోళన బుధవారంతో ముగిసినట్లు పెద్దదుద్యాల గ్రామస్థుడు సాంబశివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి సమక్షంలో విజయవాడలో ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధి కనక ప్రసాద్‌తో చర్చించామన్నారు. గ్రామ సమీపంలోని భూముల మట్టి, నీరు ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తామని, నీరు కలుషితమైనట్లు తేలితే ఫ్యాక్టరీ మూసివేస్తామన్నారు. లేకుంటే గాలి కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని, గ్రామాన్ని దత్తతతీసుకొని గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.అతి త్వరగా ప్రక్రియ ముగిస్తుందని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు ఆయన తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని ఐటీఐ విద్యార్థుల వినతి

జమ్మలమడుగు, ఆగస్టు 7: ఐటీఐ విద్యర్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చేతన్‌రెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవో శాంతమ్మకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రవాణా సౌకర్యాలు సరిగాలేని కలసపాడు, తొండూరు వంటి ప్రాంతాల్లో ఐటీఐ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. సమస్యను గుర్తించి పరీక్షా కేంద్రాలను మార్చాలని కోరారు.

## ఘనంగా బీపీ మండల్‌డే

బద్వేలు రూరల్, ఆగస్టు 7 : బీపీ మండల్ ఆశయ సాధన సమితి, బీసీ సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల్ ఆశయ సాధన సమితి కన్వీనరు కావేటి రమేశ్ యాదవ్, బీసీ భవన సాధన సమితి అధ్యక్షుడు బాలచెన్నయ్య మాట్లాడుతూ మండల కమిషన్ నివేదించిన మిగతా 39 సిఫార్సుల అమలు కోసం డిమాండ్ చేస్తూ ఏటా ఆగస్టు 7న మండల్ డేను జరుపుకుంటున్నామన్నారు. నరసింహులు, రమణయ్య, రామసుబ్బయ్య, ఎన్‌బీకే సాగర్, కత్తి బ్రహ్మయ్య, రామయ్య పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్ ఆగస్టు 7: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం భావన జూనియర్ కళాశాలల ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117, 77 జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 8వ తేదీ కడపలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఈ ప్లీనరీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, శ్రీను, అబినయ్ పాల్గొన్నారు.

## డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

పోరుమామిళ్ల, ఆగస్టు 7 : డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పరిశీలించారు. బుధవారం ఆయన పోరుమామిళ్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓఎల్ఎఫ్ బాలికల ఉన్నత పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు పద్మనాభరావు, ఆరోగ్యరాణితో మాట్లాడారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి:సీపీఐ


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ కార్యదర్శులు

గోపవరం, ఆగస్టు 7: మండలం లోని మడకల వారిపల్లె పంచాయతీ బేతా యిపల్లె, బెడుసుపల్లె పంచా యతీల్లో వందలాది ఎకరాలు కబ్జా చేసి, సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు పేదలను మాత్రం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరశేఖర్ అన్నారు. బుధవారం గోపవరం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుడు రమణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో భూకబ్జాదారులను గుర్తించి కబ్జాకు గురైన భూములు, ఇళ్లస్థలాలు, పబ్లిక్ పర్పస్ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాలు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గోపవరం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. చర్యలు తీసుకోని పక్షంలో తామే భూ పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ మండల కార్యదర్శి బాలు, గోపవరం మండలకార్యదర్శి పెంచలయ్య, బండి అనిల్, ఖాదర్‌బాషా, వెంకటయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

ఎర్రగుంట్ల, ఆగస్టు 7: ఎర్రగుంట్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఇందుకు సంబందించి ఆయా పాఠశాల హెచ్‌ఎంలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే తల్లిదండ్రులకు సమాచారం పంపారు. మొత్తం 51 పాఠశాలల్లో ఈ కమిటి ఎన్నికలు జరగుతున్నాయి. అయితే రాజకీయ పార్టీలకు చెందిన వారు ఇప్పటికే లోపాయికారీగా సీటు రిజర్వ్ చేసుకుని ఉన్నారు. దీంతో వారు చెప్పిన వారినే కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకునే అవకాశాలున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై కరపత్రాల విడుదల

ఎర్రగుంట్ల, ఆగస్టు 7: తల్లిపాల ప్రాముఖ్యతపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. తల్లిపాలకు మించిన పౌష్టికాహారం మరొకటి లేదని జేవీవీ కో కన్వీనర్ ఎస్తేర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## కొండాపురం తహసీల్దార్‌గా మాధవకృష్ణారెడ్డి

కొండాపురం, ఆగస్టు 7 : కొండాపురం తహసీల్దార్‌గా కె.మాధవక్రిష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కొండాపురం తహసీల్దార్ గా పనిచేసి బదిలీపై పులివెందులకు వెళ్లారు. ఎన్నికల విధుల్లో భాగంగా నంద్యాల జిల్లాకు బదిలీ అయిన ఈయన తిరిగి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ, ఆర్ఐ ఆనందరావు , రెవెన్యూ సిబ్బందితో పాటు, మండలంలోని పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మంత్రి పి.శివారెడ్డికి నివాళి

జమ్మలమడుగు, ఆగస్టు 7: జమ్మలమడుగులోని సంజాముల మోటులో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కార్యాలయంలో బుధవారం దివంగత నేత పొన్నపురెడ్డి శివారెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పొన్నపురెడ్డి లక్ష్మిదేవమ్మ, గిరిధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మురళీధర్‌రెడ్డి, సీతారాముడు, రాజా, మానసిక వికలాంగులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం జమ్మలమడుగులోని గాయత్రీ వృద్ధాశ్రమంలో గూడెం చెరువులోని మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం చేశారు.

## ఇటుకలు మీద పడి తాపీ కార్మికుడి మృతి

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 7 : ఇటుకలను భవనం పై అంతస్తులోకి పంపే క్రమంలో జారి మీద పడడంతో తాపీ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు స్థానిక రామేశ్వరం బైపాస్ ప్రాంతానికి చెందిన విశ్వనాథ్ (46) బుధవారం మౌలానా ఆజాద్ వీధిలోని ఓ వైసీపీ నాయకుడికి చెందిన ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. ఇటుకలను యంత్రం ద్వారా భవనం పైకి పంపే క్రమంలో అవి జారి అతనిపై పడ్డాయి. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పల్లాలక్ష్మిదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.